సాక్షి
అనకాపల్లి
శుక్రవారం । 24 । ఫిబ్రవరి । 2023



అలరించిన బృందగానం

విశాఖ: భక్త రామదాసు జయంతి వేడుకలను త్యాగరాజు ఆరాధన ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం కళాభారతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు.



సినిమా సందడి 10లో

మోతుగూడెం పరిసరాల్లో సీలేరు నదీ తీరంలో హీరో నాగచైతన్య, హీరోయిన్ కృతిశెట్టిలతో సినిమా షూటింగ్ జరుగుతోంది.



లాయర్ల క్షీరాభిషేకం

లా నేస్తం ద్వారా జూనియర్ లాయర్లకు లబ్ధి చేకూరుస్తున్నందుకు కృతజ్ఞతగా సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. 12లో

న్యూస్‌రీల్

ఉపాధ్యాయులకు అభినందన



రవిప్రతాప్, నర్సింగరావులకు సన్మానం

దేవరాపల్లి: జాతీయ అథ్లెటిక్స్ హైజంప్‌లో సిల్వర్ మెడల్ సాధించిన తెనుగుపూడి హైస్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయుడు రవి ప్రతాప్, జాతీయ స్థాయి పోటీల్లో రాణించేలా విద్యార్థులకు తర్ఫీదునిస్తున్న పీడీ డి.నర్సింగరావులను ఘనంగా సత్కరించారు. తెనుగుపూడి జెడ్పీ హైస్కూల్లో గురువారం హెచ్‌ఎం వి.ఉమాశంకర్, ఉపాధ్యాయులు వారికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి, వారి సేవలను కొనియాడారు.

ఏయూ ఫార్మా హబ్ సందర్శన



ఎఫ్‌డీఏ డైరెక్టర్ కార్మలో రోసాను సత్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: ఏయూలో నూతనంగా ఏర్పాటవుతున్న ఫార్మసీ హబ్‌ను గురువారం ఎఫ్‌డీఏ డ్రగ్ క్వాలిటీ(అమెరికా) డివిజన్ డైరెక్టర్ డాక్టర్ కార్మలో రోసా సందర్శించారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి ఆయన్ని ప్రాంగణానికి తీసుకువెళ్లి హబ్ విశేషాలను వివరించారు. ఫార్మా రంగంలో నూతన ఆవిష్కరణలు చేపట్టేలా యువతను ప్రోత్సహించడానికి ఈ కేంద్రం పనిచేస్తుందన్నారు.

డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజీ సందర్శన



వెల్లింగ్టన్‌లోని డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజీని సందర్శిస్తున్న బిశ్వజిత్ దాస్‌గుప్తా

సింధియా: తమిళనాడులోని వెల్లింగ్టన్ డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజీని తూర్పు నావికాదళ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ బిశ్వజిత్ దాస్ గుప్తా సందర్శించారు. ఈ నెల 21వ తేదీన ప్రారంభమైన ఆయన పర్యటన 23వ తేదీతో ముగిసింది. హిందూ మహా సముద్ర ప్రాంతంలో సవాళ్లపై 78వ స్టాఫ్ కోర్సులో పాల్గొన్న అధికారులనుద్దేశించి ప్రసంగించారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు స్వర్ణ పుష్పార్చనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీ స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై ఉంచి, 108 స్వర్ణ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శత నామావళి పూజ నిర్వహించారు. స్వామివారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేడు న్యాయవాదుల సంఘం ఎన్నికలు

విశాఖలీగల్: ప్రతిష్టాత్మకమైన విశాఖ న్యాయవాదుల సంఘం వార్షిక ఎన్నికలు శుక్రవారం జరగనున్నాయి. ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు ఎన్నికల అధికారి జి.ఎం.రెడ్డి, ఉప ఎన్నికల అధికారి ఎం.కె.శ్రీనివాస్ తెలిపారు. 3,047 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఓటర్ల సహాయార్థం ప్రత్యేక సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నికలు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతాయి. 5 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతోంది. వివిధ పదవులకు గాను 100 మందికి పైగా న్యాయవాదులు పోటీలో ఉన్నారు.



మన్యం కాఫీ అధరహో

- నర్సీపట్నం కాఫీ క్యూరింగ్ సెంటర్‌లో జోరుగా పనులు
- అంతర్జాతీయ మార్కెట్‌లో పెరిగిన ధర
- దిగుబడి మెరుగుపడడంతో ఆదాయం పెరిగే అవకాశం
- ఈ ఏడాది 27 మెట్రిక్ టన్నుల విక్రయం
- వేలానికి సిద్ధంగా మరో 53 మెట్రిక్ టన్నుల శుద్ధి కాఫీ

నర్సీపట్నం: అంతర్జాతీయ మార్కెట్‌లో ధర పెరగడంతోపాటు దిగుబడి మెరుగుపడడంతో నర్సీపట్నంలోని కాఫీ క్యూరింగ్ సెంటర్ శుద్ధీకరణ పనులు జోరుగా సాగుతున్నాయి. రెండు తెలుగు



కాఫీ గింజలను శుద్ధి చేసే యంత్రాలు



మాన్యువల్ పద్ధతిలో కాఫీ గింజలను వేరు చేస్తున్న కార్మికులు

రాష్ట్రాల్లో ఏపీఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఏకైక కాఫీ శుద్ధి కేంద్రమిది. జనవరిలో క్యూరింగ్ పనులు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ఆధీనంలో ఏజెన్సీలో 8 వేల ఎకరాల్లో కాఫీ సాగవుతోంది. ఇక్కడ ఉత్పత్తి అయ్యే కాఫీ గింజలను నర్సీపట్నంలోని క్యూరింగ్ సెంటర్‌లో శుభ్రం చేసి ఈ–వేలం ద్వారా విక్రయిస్తుంటారు. ఆరేళ్ల క్రితం ఈ కేంద్రం ద్వారా 1500 మెట్రిక్ టన్నుల నుంచి 2 వేల టన్నుల వరకు కాఫీ గింజలను శుద్ధి చేసేవారు. రానురాను పంట దిగుబడి తగ్గడంతో 400 మెట్రిక్ టన్నులలోపే ఉత్పత్తి జరుగుతోంది. గత ఏడాది శుద్ధి చేసిన 180 మెట్రిక్ టన్నుల కాఫీ విక్రయించారు. అప్పట్లో అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో రూ.331 ధర పలకడంతో రూ.5 కోట్లకు పైగా ఆదాయం వచ్చింది. ఈ ఏడాది 230 మెట్రిక్ టన్నుల కాఫీని క్యూరింగ్ చేయాలని ఏపీఎఫ్‌డీసీ లక్ష్యంగా నిర్దేశించింది. ఇంతవరకు 80 మెట్రిక్ టన్నుల కాఫీని శుద్ధి చేశారు. అందులో 27 మెట్రిక్ టన్నుల కాఫీని విక్రయించగా రూ.కోటి ఆదాయం వచ్చింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రస్తుతం కిలో కాఫీ ధర రూ.400 పలుకుతోంది. మరో 53 మెట్రిక్ టన్నుల శుద్ధి చేసిన కాఫీ అమ్మకానికి సిద్ధంగా ఉందని అధికారులు చెబుతున్నారు. శుద్ధి చేసిన క్లీన్ కాఫీని ఐదు దఫాలుగా ఈ–వేలం ద్వారా విక్రయించనున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఉత్పత్తి పెరగడంతోపాటు అంతర్జాతీయ మార్కెట్‌లో ధర ఆశాజనకంగా ఉండటంతో రూ. 6 కోట్ల నుంచి రూ.7 కోట్ల వరకు ఆదాయం సమకూరే అవకాశం ఉందని కేంద్రం నిర్వాహకులు చెబుతున్నారు.

ధర కలిసొచ్చింది...

కాఫీ దిగుబడి గత ఏడాది కంటే పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్‌లో విశాఖ ఏజెన్సీ కాఫీకి గత ఏడాది నుంచి ధర కలిసొచ్చింది. ప్రస్తుతం మార్కెట్‌లో కాఫీ ధర రూ.390 నుంచి రూ.400 వరకు ఉంది. ఈసారి రూ.6 కోట్లకు పైగా ఆదాయం వచ్చే అవకాశం ఉంది. బ్రెజిల్ కాఫీ దిగుబడి తగ్గడంతో మన ఏజెన్సీ కాఫీకి డిమాండ్ ఏర్పడింది. రానున్న రోజుల్లో పరిస్థితి మరింత మెరుగుపడనుంది.

–ఎన్.స్వర్ణలత, డివిజనల్ మేనేజర్, కాఫీ క్యూరింగ్ సెంటర్, నర్సీపట్నం

దిగజారిన పాత్రికేయం



భీమిలి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఈనాడు దినపత్రికలను తగలబెడుతున్న నాయకులు

- 'ఈనాడు'వి దుర్మార్గపు రాతలు
- భగ్గుమన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు
- ఆ పత్రిక ప్రతుల దహనం

దేవరాపల్లి/భీమునిపట్నం: ప్రభుత్వంపై ఈనాడు అధినేత రామోజీరావు ప్రతి నిత్యం తన అక్కసును వెళ్లగక్కుతున్నారని.. ప్రభుత్వం పట్ల ప్రజల్లో విద్వేషాన్ని పెంచేలా కట్టు కథలు రాస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు మండిపడ్డారు. ఫైల్ ఫొటోలు అచ్చువేసి దారుణాలన్నీ ఇప్పుడే జరిగినట్లు చూపించే స్థాయికి 'ఈనాడు' దిగజారిపోవడం దారుణమన్నారు. గన్నవరం ఘటనలో ఈనాడు తీరుపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. వైఎస్సార్‌సీపీ శ్రేణులు దేవరాపల్లి మండలం తారువలో ఈనాడు పత్రికలను దహనం చేశాయి. ఈనాడు, రామోజీరావు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. పార్టీ మండల యువజన అధ్యక్షుడు కర్రి సూరినాయుడు, తెనుగుపూడి ఉప సర్పంచ్ కాటిపాం పెదనాయుడు, దాసరి మంగునాయుడు తదితరులు పాల్గొన్నారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆధ్వర్యంలో గాజువాక బీసీ రోడ్డులోని టీఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్ వద్ద, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ 3వ వార్డు అధ్యక్షుడు అల్లిపిల్లి నరసింగరావు, వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల ఆధ్వర్యంలో విశాఖ ఎంవీపీ కాలనీలోని పార్టీ కార్యాలయం ఎదుట ఆ పత్రిక ప్రతులను దహనం చేశారు.



విలేకర్లతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు

అడ్డంగా దొరికిన ఈనాడు

ప్రభుత్వాన్ని అభాసుపాలు చేయాలన్న కక్షతో పాత ఫొటోలతో అసత్య కథనాన్ని ప్రచురించి ప్రజాక్షేత్రంలో రామోజీ అడ్డంగా దొరికిపోయారని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఘాటుగా విమర్శించారు. తారువలో గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. టీడీపీ నేత పట్టాభిని పోలీసులు కొట్టారంటూ ఈనాడులో ప్రచురించిన అసత్య కథనం పాత్రికేయ ధర్మానికి విరుద్ధమన్నారు. చంద్రబాబు కోసం దుర్మార్గపు రాతలతో రామోజీరావు జర్నలిజానికి మాయని మచ్చ తీసుకువచ్చారన్నారు. అవాస్తవ, అసత్య కథనాలతో ఈనాడు ప్రజల్లో ఏనాడో విశ్వసనీయత కోల్పోయిందని, తాజా ఘటనతో మరోమారు తేలిపోయిందన్నారు.

కమ్యూనిస్టు యోధురాలు పార్వతమ్మ మృతి

అచ్యుతాపురం (అనకాపల్లి): తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన కమ్యూనిస్టు నాయకురాలు కె.పార్వతమ్మ (89) గురువారం వృద్ధాప్య సమస్యలతో కన్నుమూశారు. సారా వ్యతిరేక ఉద్యమం, నల్లబెల్లం, ఎరువుల బ్లాక్‌మార్కెట్ వంటి ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించిన ఆమెకు గ్రామ స్థాయి నుంచి జాతీయస్థాయి నాయకుల వరకు విస్తృత పరిచయాలు ఉన్నాయి. పార్వతమ్మ తన ఇంటిని కేంద్రంగా చేసుకొని అనేక ఉద్యమాలు చేశారు. తిమ్మరాజుపేటలో అనేక శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆమె పార్థివదేహంపై సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం పార్టీ పతాకాన్ని కప్పి నివాళులర్పించారు.



పార్వతమ్మ (ఫైల్)

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి బి.ప్రభావతి, ఎ.బాలకృష్ణ, కర్రి అప్పారావు తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. శుక్రవారం నిర్వహించనున్న ఆమె అంతిమయాత్రకు సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు హాజరుకానున్నారు.



పార్థివదేహానికి సీపీఎం నేతల నివాళి

ముగిసిన నామినేషన్ల పర్వం

- మొత్తం 44 మంది నామినేషన్లు దాఖలు
- చివరి రోజున 26 నామినేషన్లు
- 27 వరకు ఉపసంహరణకు గడువు

సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఘట్టం ముగిసింది. గురువారం చివరి రోజున 26 నామినేషన్లు కలిపి మొత్తం 44 నామినేషన్లు, 70 సెట్లు దాఖలయ్యాయి. ఉపసంహరణకు ఈ నెల 27వ తేదీ వరకూ అవకాశం కల్పించారు. గురువారం టీడీపీ తరఫున మరో అభ్యర్థి నామినేషన్ వేశారు. అనకాపల్లి జిల్లాకు చెందిన గూనూరు మల్లునాయుడు టీడీపీ రెబల్‌గా మారారు. బీసీలకు టికెట్ అంటూ మోసం చేసిన తెలుగుదేశం పార్టీపై ఎదురు తిరుగుతూ.. రెబల్ అభ్యర్థిగా బరిలో ఉన్న ఈర్లె శ్రీరాములు.. టీడీపీకి వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు నామినేషన్ వేసిన విషయం తెలిసిందే. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ తరఫున విశాఖకు చెందిన కొణతాల వెంకట అప్పారావు బరిలో దిగారు.

గత ఎన్నికల కంటే ఎక్కువ మందే...

2017 ఎన్నికల్లో మొత్తం 40 మంది నామినేషన్లు దాఖలు చేయగా.. 30 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఈ సారి ఏకంగా 44 మంది నామినేషన్లు దాఖలయ్యాయి. వీరిలో కనీసం 8 నుంచి 10 మంది ఉపసంహరించుకునే అవకాశం ఉంది. కాబట్టి.. గత ఎన్నికల కంటే ఎక్కువ మంది తుది పోరుకు బరిలో ఉండే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఆరు జిల్లాల పరిధిలో మొత్తం 331 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. 3.17 లక్షల బ్యాలెట్ పత్రాలు ముద్రించాలని నిర్ణయించారు. ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత.. పట్టభద్రుల ఎన్నికల బరిలో ఎంత మంది నిలుస్తారు.? వారి పేర్లని అక్షర్ల ప్రకారం ఎలా అమర్చాలి అనే అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని బ్యాలెట్ పత్రాల ముద్రణకు సన్నద్ధమవుతామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ డా.మల్లికార్జున, ఏఆర్‌వోగా వ్యవహరిస్తున్న డీఆర్‌వో శ్రీనివాసమూర్తి వెల్లడించారు. ఇప్పటికే వైట్ బ్యాలెట్ పేపర్లకు సంబంధించి పూర్తి బండిల్స్ సిద్ధంగా ఉంచామనీ.. 28వ తేదీ తర్వాత ముద్రణకు పంపించనున్నట్లు తెలిపారు.

రేపు వీపీటీ, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ సమీక్ష

సాక్షి, విశాఖపట్నం: డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(డీసీఐ) కార్యకలాపాలపై ఈనెల 25వ తేదీన సమీక్ష నిర్వహించనున్నట్లు పోర్టు ట్రస్ట్, డీసీఐ చైర్మన్ కె.రామ్మోహన్‌రావు తెలిపారు. కేంద్ర పోర్టులు, షిప్పింగ్, వాటర్ వేస్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి సుధాన్ష్ పంత్ ఆధ్వర్యంలో సమీక్ష జరగనుందని వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం విశాఖ చేరుకోనున్న పంత్.. శనివారం ఉదయం పోర్టు, డీసీఐని సందర్శించి సమీక్షించనున్నారని తెలిపారు.

ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో జన్మభూమి ఎక్స్‌ప్రెస్

తాటిచెట్లపాలెం: జన్మభూమి ఎక్స్‌ప్రెస్ గురువారం నుంచి పూర్తి ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో రాకపోకలు ప్రారంభించింది. ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో బయలుదేరిన ఈ ఎక్స్‌ప్రెస్‌ను వాల్తేర్ డివిజన్ సీనియర్ సిబ్బంది బి.రామగోపాలరావు(చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్), డి.వి.ప్రసాద్(చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్), పి.జాన్ తిమోతి (చీఫ్ క్రూ కంట్రోలర్), కె.ఎల్.త్రినాథ్(సీనియర్ టెక్నీషియన్)లు జెండా ఊపి ప్రారంభించారు. ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు వాల్తేర్ డివిజన్ నిరంతరం కృషి చేస్తుందని.. భవిష్యత్తులో మరిన్ని రైళ్లను ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో నడపనున్నట్లు వాల్తేర్ డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి ఓ ప్రకటనలో తెలిపారు. 1-ఏసీ చెయిర్‌కార్, 12-చెయిర్‌కార్, 5-జనరల్ సెకండ్ క్లాస్, 1-సెకండ్ క్లాస్ కం లగేజీ కం దివ్యాంగ కోచ్, 1-జనరేటర్ మోటార్ కార్ కోచ్ మొత్తం 20 ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో ఈ రైలు నడుస్తుంది.



జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు జెండా ఊపి ప్రారంభిస్తున్న రైల్వే సీనియర్ సిబ్బంది

గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సు ఏర్పాట్ల పరిశీలన

ఏయూక్యాంపస్: విశాఖ వేదికగా మార్చి 3,4 తేదీల్లో నిర్వహించనున్న గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సుకు సంబంధించి పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. గురువారం సదస్సు నిర్వహించే ఏయూ మైదానాన్ని పోలీసు కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్ పి.రాజాబాబుతో కలిసి ఆయన పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వివిధ దేశాల ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరవుతున్న దృష్ట్యా ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం ఎం.జి.ఎం పార్కులో జరుగుతున్న పనులను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పోలీసు, రెవెన్యూ, జీవీఎంసీ, అధికారులు పాల్గొన్నారు.



సదస్సు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

పోటీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

విశాఖ విద్య: పలు పోటీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి వచ్చే నెల 7 వరకు వరుసగా వివిధ పోటీ పరీక్షలు నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేశామన్నారు. ఈ నెల 25, 26 తేదీల్లో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ సెమిస్టర్ పరీక్షలు, 26న స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఆధ్వర్యంలో జూనియర్ ఇంజనీర్, మార్చి 2 నుంచి 7వ తేదీవరకు కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ పరీక్షలు ఉంటాయన్నారు.




మాట్లాడుతున్న విశాఖ డీఆర్‌వో శ్రీనివాసమూర్తి

విద్యార్థులు పరీక్ష సమయం కంటే అరగంట ముందుగానే చేరుకోవాలన్నారు. పరీక్షల రోజుల్లో విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. కేంద్రాల్లో వైద్య శిబిరాలను నిర్వహించాలన్నారు. సంబంధిత అధికారులంతా సమన్వయంతో పని చేసి పరీక్షలు సజావుగా జరిగేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో ఎస్‌ఎస్‌సీ, జీవీఎంసీ, పోలీసు, మెడికల్, విద్యుత్ శాఖల పాటు, వివిధ కాలేజీల నుంచి లైజనింగ్ అధికారులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో సృజనకు పట్టం

- జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ
- ఘనంగా ముగిసిన జిల్లా వైజ్ఞానిక ప్రదర్శన
- రాష్ట్రస్థాయికి 10 నమూనాలు ఎంపిక



నేనూ చెట్టునవుతా (వృక్షం బొమ్మతో ఉపాధ్యాయుడి వినూత్న అవగాహన)



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో డీఈవో వెంకటలక్ష్మమ్మ

అనకాపల్లిటౌన్: జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థుల ఆవిష్కరణలు కొత్త ఆలోచనలను రేకెత్తించాయి. వారి సృజనాత్మకతకు ఎల్లలు లేవని స్పష్టం చేశాయి. స్థానిక జీవీఎంసీ పెద హైస్కూల్లో రెండు రోజులపాటు జరిగిన ఈ ప్రదర్శనలు గురువారం ముగిశాయి. జిల్లాలోని 103 పాఠశాలల నుంచి 117 ప్రాజెక్టులు ప్రదర్శనకు వచ్చాయి. వీటిలో ఉత్తమమైన 10 ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ ప్రాజెక్టులు విజయవాడలోని లయోలా కళాశాలలో ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ప్రదర్శనలో పోటీపడనున్నాయి. రెండు రోజులపాటు జరిగిన ఈ ప్రదర్శనకు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ పర్యవేక్షణలో ఉప విద్యాశాఖాధికారి డాక్టర్ ఎన్.ప్రేమ్‌కుమార్, ఏడీ రవికుమార్ సమన్వయకర్తలుగా వ్యవహరించారు. ముగింపు వేడుకల్లో పాల్గొన్న డీఈవో వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇటువంటి వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. మండలస్థాయిలో ప్రదర్శనలు ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి బాటలు వేయొచ్చన్నారు. రాష్ట్ర స్థాయి ప్రదర్శనలో కూడా జిల్లా విద్యార్థులు ప్రతిభ చూపి, బహుమతులు గెలుచుకుంటారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. డీవైఈవో ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు మేధాశక్తికి మరింత పదును పెట్టేందుకు ఇలాంటి ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

రాష్ట్ర స్థాయికి ఎంపికైన ప్రాజెక్టులు

జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించిన ఐదు అంశాల్లో ఒక్కో అంశం నుంచి రెండు ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఎకోఫ్రెండ్లీ మెటీరియల్స్ విభాగంలో జెడ్పీ హైస్కూల్(కోటవురట్ల), జెడ్పీ హైస్కూల్, పెదగుమ్మలూరు(ఎస్.రాయవరం), పర్యావరణం–వాతావరణ మార్పుల కేటగిరీలో ప్రభుత్వ హైస్కూల్(సబ్బవరం), జెడ్పీ హైస్కూల్, చెట్టిపల్లి(నర్సీపట్నం), ఆరోగ్యం–పరిశుభ్రత అంశంలో జెడ్పీ హైస్కూల్, గొడిచెర్ల(నక్కపల్లి), జెడ్పీ హైస్కూల్, ఆరిపాక(సబ్బవరం), సాఫ్ట్‌వేర్ అండ్ యాప్స్ విభాగంలో జెడ్పీ హైస్కూల్, వీరనారాయణం(వి.మాడుగుల), ఏపీ రెసిడెన్షియల్ స్కూల్(అచ్యుతాపురం), మేథమెటికల్ మోడలింగ్‌లో జెడ్పీ హైస్కూల్, తిమ్మరాజుపేట(మునగపాక), జెడ్పీ హైస్కూల్, లింగరాజుపాలెం(ఎస్.రాయవరం) విద్యార్థుల నమూనా ప్రాజెక్టులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాయి.

సైన్సును ప్రోత్సహిద్దాం

వైజ్ఞానిక ప్రదర్శనలో భాగంగా సైన్సును ప్రోత్సహిద్దామనే వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు ఒక ప్రత్యేక బ్యానర్‌పై ఉన్నతాధికారులు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయుల సంతకాలను సేకరించారు. ముందుగా జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ సంతకం చేశారు. అనంతరం డీవైఈవో ప్రేమ్‌కుమార్, ఏడీ రవిబాబు, డీఎస్‌వో కె.ప్రసాద్, ఇతర అధికారులు సంతకాలు చేసి, సైన్స్ పట్ల విద్యార్థుల్లో ఆసక్తి పెంచేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన చంద్రయాన్, పర్యావరణ పరిరక్షణలో చెట్ల ప్రాధాన్యతను తెలిపే నమూనాల వద్ద ఉపాధ్యాయులు, విద్యార్థులు ఫొటోలు దిగారు. స్వాగత ద్వారం వద్ద ఏర్పాటు చేసిన రాకెట్ నమూనా సందర్శకులను ఆకట్టుకుంది.



సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థిని

క్లుప్తంగా

రైతు విభాగం జిల్లా అధ్యక్షుడికి సత్కారం


అప్పారావును సత్కరిస్తున్న బూడి

చీడికాడ: వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన చీడికాడకు చెందిన యర్రా అప్పారావును డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు గురువారం దుశ్శాలువాతో సత్కరించారు. దేవరాపల్లి మండలం తారువ క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులతో కలిసి బూడికి అప్పారావు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ కురచా జయమ్మ, మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు తదితరులున్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి ఇరెస్టు


పట్టుబడిన వారితో పోలీసులు

మాకవరపాలెం: గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను అరెస్టు చేశామని ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. కోటవురట్ల మండలం గొట్టివాడకు చెందిన బండి పరమేశ్వరరావు(27), కలిగట్ల లక్ష్మీదుర్గాప్రసాద్ (22) మోటారు సైకిల్‌పై గురువారం గంజాయి తరలిస్తుండగా మండలంలోని కొండల అగ్రహారం జంక్షన్ వద్ద పట్టుకున్నామన్నారు. వీరి వద్ద నుంచి 10 కేజీల గంజాయి, బైక్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. వీరిని అరెస్టు చేసి కోర్టుకు తరలించామని ఎస్ఐ తెలిపారు.

సృజనకు సాన.. వైజ్ఞానిక ప్రదర్శన

- ఆలోచింపజేసిన ప్రాజెక్టుల నమూనాలు
- ఆసక్తిగా తిలకించిన వేలాది మంది విద్యార్థులు
- ఘనంగా ముగిసిన జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు


ప్రదర్శనలను తిలకిస్తున్న విద్యార్థులు


సైన్స్‌ను ప్రోత్సహిస్తామంటూ సంతకం చేస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

అనకాపల్లి టౌన్: విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తి పెంచి.. వారిలో ఆలోచనలకు పదునుపెట్టి నూతన ఆవిష్కరణలు చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లా స్థాయిలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా అనకాపల్లి పట్టణంలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల (మెయిన్)లో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలు గురువారంతో ఘనంగా ముగిశాయి. రెండో రోజూ ఇక్కడ ప్రదర్శించిన పలు నమూనాలను తిలకించడానికి నగరంలోని వివిధ పాఠశాలలు విద్యార్థులు వేలాదిగా తరలి వచ్చారు. తోటి విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టుల నమూనాలను పరిశీలించి తమ పుస్తకాల్లో నోట్ చేసుకున్నారు. ప్రదర్శనలు పరిశోధనాత్మకంగా సృజనాత్మక ఆలోచనలు వెలికి తీసే విధంగా ఉన్నాయని చెప్పారు.

ఆకురసాలతో దోమల నిర్మూలన


పర్యావరణహిత దోమల నిర్మూలన నమూనా

విద్యార్థి పేరు: కె.వినోద్ (9వ తరగతి)
గైడ్ టీచర్: సూర్యనారాయణ
పాఠశాల: జెడ్పీ ఉన్నత పాఠశాల, లక్ష్మీపురం
ఉపయోగం: లాంటానా మొక్క ఆకు ఉపయోగాలను తెలుసుకుంటే దోమల నిర్మూలన సులువవుతుంది. ఈ మొక్క ఆకు రసాన్ని సేకరించి దాన్ని కాలువలు, నీటి నిల్వ ప్రదేశాల్లో చల్లితే దోమల లార్వాలు 24 గంటల్లో చనిపోతాయి. దీని వల్ల పర్యావరణ హితంగా దోమల నిర్మూలనతో పాటు డెంగ్యూ, మలేరియా వ్యాధిని సమర్థవంతంగా నిర్మూలించవచ్చు.

హైడ్రో ఎలక్ట్రికల్ పవర్ ఉత్పత్తి



విద్యార్థి పేరు: కె.రీష్మ
గైడ్ టీచర్: నఫిషా
పాఠశాల: జెడ్పీహెచ్ఎస్

తక్కువ ఖర్చుతో విద్యుత్ తయారు చేయడం ఈ ప్రాజెక్టు ముఖ్యోద్దేశం. దీనిలో బొగ్గు వినియోగాన్ని తగ్గించి ప్రకృతి సిద్ధంగా లభించే నీటి వనరులు ద్వారా విద్యుత్‌ను తయారు చేస్తారు. వర్షం వచ్చినప్పుడు ఆ నీటిని మన ఇంటి వద్దనే ఉపయోగించుకుని కనీస అవసరాలకు అవసరమైన విద్యుత్‌ను తయారు చేయవచ్చు

పర్యావరణ హిత ఇంధన వినియోగం

విద్యార్థి పేరు: మోన్సిత (9వ తరగతి)
గైడ్ టీచర్: రొంగలి ప్రసాద్
పాఠశాల: ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సబ్బవరం
వివరణ: నీటిలోని హైడ్రోజన్‌ను విద్యుత్ విశ్లేషణ పద్ధతి ద్వారా వేరు చేసి పర్యావరణ హితమైన ఇంధనం తయారు చేయొచ్చు. ఈ ఇంధనం తయారీతో ఎటువంటి కర్బన్ ఉద్గారాలు వాతావరణంలో కలవవు. దీన్ని వినియోగించినప్పుడు కర్బన్ ఉద్గారాలు విడుదల కావు. నీటి ఆవిరి మాత్రమే బయటకు వెలువడుతుంది. దీనివల్ల వాతావరణానికి మేలు కలుగుతుంది. దీనివల్ల కర్బన్ ఉద్గారాలు, గ్లోబల్ వార్మింగ్ తగ్గించి ప్రాణికోటికి హాని కలగకుండా చేయవచ్చు. ప్రధాని మోదీ ప్రభుత్వం 2021లో నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ (ఎన్‌జీహెచ్ఎం)ను ప్రారంభించి బడ్జెట్టులో నిధులు కేటాయించారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ ప్రాజెక్టు తయారు చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు ఈ మిషన్ ప్రారంభించడానికి సిద్ధమవుతున్నాయి. 2030 సంవత్సరానికి కర్బన ఉద్గారాలు, భూతాపం తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం ద్వారా భారత దేశం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తుంది.


గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి నమూనా ప్రదర్శన

బొలెరో వాహనం దొంగిలించిన ఇద్దరి అరెస్ట్

గూడెంకొత్తవీధి: మండల కేంద్రంలో ఇటీవల బొలెరో వాహనాన్ని దొంగిలించిన ఇద్దరు వ్యక్తులను గురువారం అరెస్ట్ చేశామని సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. స్థానిక కిరాణా వ్యాపారి అబ్దుహీర్‌కు చెందిన బొలెరో వాహనాన్ని ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఒడిశాలోని చిత్రకొండ బస్‌స్టాండ్ వద్ద వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. సంఘటనకు పాల్పడిన కిల్లో సురేష్, తామరబిల్లి నవీన్‌లను అరెస్ట్ చేశామన్నారు. ఎస్ఐ అప్పలసూరి తదితరులు పాల్గొన్నారు.


పోలీసులు అరెస్ట్ చేసిన నిందితులు

416 లీటర్ల నాటుసారా ధ్వంసం

అడ్డతీగల: అడ్డతీగల సర్కిల్లోని నాలుగు పోలీస్‌స్టేషన్ల పరిధిలో గతంలో వివిధ కేసుల్లో పట్టుబడిన 416 లీటర్ల నాటుసారాని రంపచోడవరం ఏఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా ఆధ్వర్యంలో పోలీసులు గురువారం ధ్వంసం చేశారు. అడ్డతీగల పోలీస్‌స్టేషన్ మైదానంలో నాటుసారాని పెద్ద గొయ్యి తవ్వించి అందులో వేసి కప్పేశారు. అడ్డతీగలకు చెందిన 270 లీటర్లు, గంగవరం 100 లీటర్లు, వై.రామవరం 28, దుశ్శర్తి 18 లీటర్ల సారాని ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో అడ్డతీగల సీఐ వై.రాంబాబు, ఎస్ఐ అప్పలరాజు, దుశ్శర్తి ఎస్ఐ ఎల్.లతాశ్రీ, వై.రామవరం ఎస్ఐ సంతోష్‌కుమార్, గంగవరం ఎస్ఐ చిన్నబాబు, వీఆర్వో రాధయ్య ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


పట్టుబడిన సారాను గోతిలో వేయిస్తున్న ఏఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా

మనస్థాపానికి గురై యువకుడి ఆత్మహత్య

హుకుంపేట: మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ సతీష్ కథనం ప్రకారం మండలంలోని తడిగిరి పంచాయితీ కేంద్రంలో పాంగి ప్రసాద్ (20) అనే యువకుడు గ్రామ సమీపంలోని పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. గ్రామస్తుల సమాచారం మేరకు ఎస్ఐ గ్రామానికి చేరుకుని మృతి చెందిన యువకుడి వివరాలు గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. మృతి చెందిన యువకుడికి మద్యం అలవాటు ఉందని, మత్తు పదార్థాలు అధికంగా తీసుకుంటాడని తెలిపారు. గత కొన్ని రోజులుగా పెళ్లి చేయమంటూ గొడవ చేసేవాడని అన్నారు. యువకుడు అనాథ అని.. లక్ష్మణరావు అనే వ్యక్తి 20 ఏళ్లుగా పెంచుకుంటున్నాడని తెలిపారు. మద్యం, చెడు అలవాట్ల మూలంగా పెళ్లి చేస్తే ఇబ్బందులు తలెత్తాయని పెంపుడు తండ్రి ఆలస్యం చేయటంతో మనస్థాపానికి గురయ్యాడన్నారు. దీంతో గ్రామానికి సమీపంలో చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించామని ఎస్ఐ సతీష్ తెలిపారు.


చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ప్రసాద్

ప్రజల్లో మార్పుతో తగ్గిన ప్లాస్టిక్ వినియోగం



నగరంలో ఏర్పాటు చేసిన కియోస్కు

డాబాగార్డెన్స్: ప్లాస్టిక్ నిషేధంతో ప్రజల్లో మార్పు వచ్చిందని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు అన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధానికి ముందు నగరంలో రోజుకు 10 టన్నుల ప్లాస్టిక్‌ను వినియోగించేవారని.. నిషేధం తర్వాత అది 3 టన్నులకు చేరిందన్నారు. పూర్తిగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధానికి అందరూ సహకరించాలని.. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా కాగితపు, చెక్క, ఆకులతో చేసిన ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించాలని సూచించారు. చెక్క, ఆకులు, పేపర్‌స్ట్రాల్, నార తదితర వస్తువులు తక్కువ ధరకే అందుబాటులో ఉండేలా పూర్ణా మార్కెట్‌లో మొదట ప్లాస్టిక్ కియోస్కు ప్రారంభించగా.. విజయవంతమైందన్నారు. ఈ క్రమంలో గవరకంచరపాలెం, అనకాపల్లి మెయిన్‌రోడ్డు, గాజువాక, మధురవాడ, తగరపువలస, వేపగుంట, ఎంవీపీకాలనీ, జగదాంబ జంక్షన్, సీతమ్మధార తదితర ప్రాంతాల్లో ఈ కియోస్కులు ప్రారంభించామన్నారు. ఈ ప్లాస్టిక్ కియోస్కుల ద్వారా కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ఆమోదించిన మొక్కజొన్న ముడి పదార్థాలతో తయారు చేసిన క్యారీ బ్యాగులు అందుబాటులో ఉంటాయన్నారు. ఇవి 90 రోజుల్లో భూమిలో పూర్తిగా కలిసిపోయి ఎరువుగా మారుతాయని పేర్కొన్నారు.

చెరువుల ఆక్రమణ చట్టరీత్యా నేరం

వై.బి.అగ్రహారంలో చెరువును పరిశీలించిన నర్సీపట్నం ఆర్డీవో జయరాం


వై.బి.అగ్రహారం చెరువు గర్భంలో సాగు భూములను పరిశీలిస్తున్న ఆర్డీవో జయరాం

నాతవరం: గెడ్డ పోరంబోకు భూములు, చెరువుల ఆక్రమణ చట్టరీత్యా నేరమని నర్సీపట్నం ఆర్డీవో హనుమంత జయరాం హెచ్చరించారు. మండంలోని వై.బి.అగ్రహారంలో నర్సయ్య గంగసపల్లి చెరువును గురువారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఇక్కడ సర్వే నంబరు 13/1లో 20 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ చెరువులో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగికి నాలుగు ఎకరాలు ప్రోసెడింగ్ ఇచ్చారు. చెరువు ఆక్రమణపై ఉమ్మడి జిల్లాలో ఏర్పాటు చేసిన సిట్‌లో ఫిర్యాదు నమోదైంది. ఈ నేపథ్యంలో చెరువును పరిశీలించిన ఆర్డీవో అక్కడ రైతులతో మాట్లాడారు. చెరువు పూర్వ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ రికార్డుల్లో నమోదైన దానికి క్షేత్రస్థాయిలో ఉన్న దానికి పొంతన లేకపోవడంతో పూర్తిస్థాయిలో సర్వే చేయాలని సిబ్బందిని ఆదేశించారు. చెరువును ఆక్రమించుకున్న వారంతా యుద్ధ ప్రాతిపదికన ఖాళీ చేయాలన్నారు. చెరువులో సాగు చేసే రైతుల వద్ద రికార్డులను తహసీల్దార్ కార్యాలయంలో చూపించాలన్నారు. ఇదే విధంగా మండల వ్యాప్తంగా చెరువులు ఆక్రమణకు గురి కాకుండా దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఎక్కడైనా ఆక్రమిస్తే తొలగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. రెవెన్యూ డివిజన్‌లో భూ రీసర్వేను వేగవంతం చేసేందుకు దృష్టి సారించామన్నారు. సర్వే విధి విధానాలపై అనుమానం కలిగిన రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయరు రమణ, ఆర్ఐ నారాయణరావు, వీఆర్వో గణేష్, సచివాలయ సర్వేయర్లు విజయ్‌కుమార్, కిరణ్ పాల్గొన్నారు.

రెండు పశువుల పాకలు దగ్ధం

చోడవరం రూరల్: మండలంలోని గజపతినగరం గ్రామంలో గురువారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో సంభవించిన అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన శరగడం వెంకటరమణకు చెందిన రెండు పశువుల పాకలు దగ్ధమయ్యాయి. పాకలో దాచుకున్న ఏడు ఎరువుల బస్తాలు, మోటారు పంపు హోస్‌పైపులు మంటలకు కాలి బూడిదయ్యాయి. పాకలకు ఆనుకుని ఉన్న గుంజకు కట్టిన ఆవుపెయ్యకు మంటల సెగ తాకడంతో పాక్షికంగా గాయాలయ్యాయి. ప్రమాద సమాచారం తెలుసుకున్న చోడవరం అగ్నిమాపక దళాధికారి బీవీ రామస్వామి సిబ్బందితో ప్రమాద స్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి కారణం తెలియరాలేదు. బీఎన్ రోడ్డుకు సమీపంలో బాధితుల నివాసాలు, వాటిని ఆనుకుని పశువుల పాకలు ఉండడంతో ఎవరైనా కాల్చిపారేసిన సిగరెట్ రాజుకుని ప్రమాదం సంభవించి ఉంటుందని అనుమానిస్తున్నారు.


దగ్ధమైన పశువుల పాకలు

బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి అరెస్టు


తాపీమేస్త్రి గడసాల శివసాయి

కశింకోట: ప్రియురాలి కోసం ప్రైవేట్ కళాశాల బస్సులో వీరంగం సృష్టించి డ్రైవర్‌ను కత్తితో పొడిచేందుకు ప్రయత్నించిన తాపీమేస్త్రీని గురువారం అరెస్టు చేశారు. మండలంలోని బయ్యవరం వద్ద జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ ఎ. ఆదినారాయణరెడ్డి విలేకరులకు అందించిన వివరాల ప్రకారం.. మండలంలోని బయ్యవరం గ్రామానికి చెందిన తాపీమేస్త్రి గరసాల శివసాయి (22) ఇక్కడి మరో గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థినిని ప్రేమించానంటూ కొంత కాలంగా వెంటపడుతున్నాడు. దీనిలో భాగంగా ఈనెల 21 సాయంత్రం అనకాపల్లి నుంచి తేగాడ వైపు వెళుతున్న అనకాపల్లికి చెందిన సంయుక్త ప్రైవేట్ కళాశాల బస్సును మార్గమధ్యలో స్కూటీ అడ్డంగా పెట్టి నిలిపాడు. తన ప్రియురాలిని బస్సులో నుంచి కిందకు దించాలని బస్సు డ్రైవర్ రొంగలి దేముళ్లను డిమాండ్ చేస్తూ దూషించాడు. అంతే కాక బస్సులో వీరంగం సృష్టించి డ్రైవర్ మెడపై కత్తి పెట్టి చంపుతానని బెదిరించాడు. దీంతో విద్యార్థులు, డ్రైవర్ భయభ్రాంతులకు గురయ్యారు. ఈ ఘటనపై డ్రైవర్ దేముళ్ల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

స్కూటీ డిక్కీలో ఉంచిన రూ. 2 లక్షల చోరీ

యలమంచిలి: పట్టణంలో గురువారం స్కూటీ డిక్కీలో భద్రపరిచిన రూ. 2 లక్షల నగదును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. దీనికి సంబంధించి పట్టణ అదనపు ఎస్ఐ కె. వెంకటరావు తెలియజేసిన వివరాల ప్రకారం.. యలమంచిలి నెహ్రూనగర్‌కు చెందిన చెక్కా అప్పారావు స్థానిక స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ నుంచి రూ. 2.38 లక్షల నగదు విత్ డ్రా చేశారు. బ్యాంక్ నుంచి బయటికి వచ్చి తన స్కూటీ డిక్కీలో రూ. 2 లక్షలు ఉంచి పాడైన నోట్లను బ్యాంకులో తిరిగి ఇచ్చేందుకు బ్యాంక్‌లోకి వెళ్లారు. తిరిగి వచ్చేసరికి తన స్కూటీ డిక్కీలో ఉంచిన రూ. 2 లక్షలు చోరీకి గురైనట్లు గుర్తించారు. దీంతో లబోదిబోమంటూ యలమంచిలి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ వెంకటరావు తెలిపారు.

ఐదేళ్ల బాలికపై అత్యాచారయత్నం?

పోలీసుల అదుపులో నిందితుడు


భీమునిపట్నం: భీమిలిలో ఐదేళ్ల బాలికపై ఓ వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడగా గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఇక్కడ అప్పికొండ వీధిలో నివాసముంటున్న 50 ఏళ్ల గల వ్యక్తి తన ఎదురింట్లో ఉంటున్న ఐదేళ్ల బాలికకు మాయమాటలు చెప్పి తన ఇంట్లోకి తీసుకొచ్చి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాలిక అరవడంతో ఆమె తల్లి, చుట్టుపక్కలవారు వచ్చి అతన్ని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. దీనిపై సీఐ లక్ష్మణమూర్తి మాట్లాడుతూ అతన్ని అదుపులోకి తీసుకుని దిశ స్టేషన్‌కు అప్పగించినట్లు తెలిపారు. వారు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటారన్నారు.

మహిళపై దుష్ప్రచారానికి ఐఐటీ తెలివి

- ఫేక్ ఈమెయిల్‌తో అసభ్యకర మెసేజ్‌లు
- యువకుడిని అరెస్ట్ చేసిన సైబర్ పోలీసులు

దొండపర్తి: ఐఐటీ ఇంజనీరింగ్ తెలివి తేటలు యువతిపై దుష్ప్రచారానికి ప్రదర్శించాడు. టెక్నాలజీపై ఉన్న పట్టుతో.. ఎవరూ కనిపెట్టలేరన్న ధీమాతో ఫేక్ ఈమెయిల్ క్రియేట్ చేసి అసభ్యకర మెసేజ్‌లు పంపించాడు. మహిళ ఫిర్యాదుతో సైబర్ క్రైం పోలీసులు అదే సాంకేతికతను వినియోగించి చాకచక్యంగా యువకుడిని గుర్తించి అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. నగరానికి చెందిన యువతి హెచ్‌పీసీఎల్ కంపెనీలో పనిచేస్తోంది. కొద్ది రోజుల నుంచి ఆమెకు గుర్తు తెలియని వ్యక్తి ఈమెయిల్ నుంచి అసభ్యకరంగా మెసేజ్‌లు రావడం ప్రారంభమయ్యాయి. అలాగే ఆ కంపెనీలో ఇతరుల ఈమెయిల్స్‌కు కూడా సదరు యువతి గురించి చెడుగా ప్రచారం చేస్తూ మెసేజ్‌లు పంపించాడు. దీంతో ఆమె సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన సైబర్ క్రైం సీఐ కె.భవాని ప్రసాద్ సాంకేతికత సహాయంతో ఆ ఈమెయిల్స్ పంపిస్తున్నది అదే కంపెనీలో పనిచేస్తున్న సహోద్యోగి కడప జిల్లాకు చెందిన రామత్ మల్లికార్జున నాయక్‌గా గుర్తించారు. అతడు ఐఐటీ గౌహతిలో ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. టెక్నాలజీపై మంచి పట్టు ఉండడంతో ఎవరూ కనిపెట్టలేరన్న ధీమాతో ఈమెయిల్ క్రియేట్ చేసి యువతిపై దుష్ప్రచారానికి పాల్పడినట్లు తెలుసుకొని మల్లికార్జునను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. సోషల్ మీడియాలో మహిళలను అగౌరపరిచినా, కించపరిచినా ఉపేక్షించేది లేదని సైబర్ క్రైం సీఐ కె.భవాని ప్రసాద్ హెచ్చరించారు.

మోతుగూడెంలో 'కస్టడీ' సందడి


లొకేషన్‌లో హీరో నాగ చైతన్య

మోతుగూడెం: మోతుగూడెం పరిసర ప్రాంతాల్లో సినిమా షూటింగ్ సందడి నెలకొంది. హీరో నాగ చైతన్య, హీరోయిన్ కృతిశెట్టితో తెరకెక్కిస్తున్న కస్టడీ సినిమాకు సంబంధించి పలు సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ పవన్ కుమార్ సమర్పిస్తున్న ఈ సినిమాకు డైరెక్టర్‌గా వెంకట ప్రభు, ప్రొడ్యూసర్‌గా చిట్టూల శ్రీనివాస్ వ్యవహరిస్తున్నారు. బుధవారం ఇక్కడికి సమీపంలోని సీలేరు నదిలో హీరో హీరోయిన్లపై పలు సన్నివేశాలు చిత్రీకరించారు. గురువారం డొంకరాయి జలాశయం పరిసరాలలో సన్నివేశాలు చిత్రీకరిస్తామని యూనిట్ సభ్యులు తెలిపారు. ఈ చిత్రంలో హీరో శరత్ కుమార్ కూడా ముఖ్య పాత్ర పోషిస్తున్నట్లు వారు తెలిపారు. సినిమా షూటింగ్‌ను తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు.

ఒడిశా కూలీ అదృశ్యం

కశింకోట : కశింకోట వద్ద ఇటుకల బట్టీలో పనిచేయడానికి వచ్చిన ఒడిశా కూలీ అదృశ్యంపై గురువారం కేసు నమోదు చేసినట్లు అదనపు ఎస్ఐ జె.నాగేశ్వరరావు తెలిపారు. వివరాలు.. ఒడిశా రాష్ట్రంలోని బోలంగిరి జిల్లా సులేకల చంద్రపు గ్రామానికి చెందిన గొమ్మటి బుయే (47) ఇక్కడి ఒక ఇటుకల బట్టీలో పని చేయడానికి భర్త, పిల్లలతో పాటు వచ్చింది. ఈ నెల 21న ఎవరికీ చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయింది. దీంతో ఆమె ఆచూకీ కోసం భర్త అక్షయ బుయే ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అదనపు ఎస్ఐ తెలిపారు.

క్లుప్తంగా

స్థిరంగా కూరగాయల ధరలు

కశింకోట : స్థానిక వారపు సంతలో గురువారం కూరగాయల ధరలు దాదాపు స్థిరంగానే ఉన్నాయి. కిలో టమాటా రూ.15, ఉల్లి, బంగాళాదుంప రూ.20, వంకాయ రూ.30,దకాయ, క్యారెట్, బీట్‌రూట్, చిక్కుడు, దొండకాయ రూ.40, బెండకాయ, క్యాప్సికం రూ.60, బీన్స్ కాయలు రూ.80కి విక్రయాలు సాగాయి. గోబీ పువ్వు, ఆనపకాయ ఒక్కొక్కటి సైజ్‌ను బట్టి రూ.10 నుంచి రూ.30 వరకు విక్రయాలు సాగాయి.

ఘనంగా రోటరీ క్లబ్ వార్షికోత్సవం



పేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

అనకాపల్లిటౌన్ : రోటరీక్లబ్ ఆవిర్భావ దినోత్సవం గురువారం ఘనంగా జరిగింది. పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలలతో పాటు, ప్రధాన కూడళ్లు, ఆలయాల్లో క్లబ్ ప్రతినిధులు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు తొలుత రోటరీక్లబ్ వ్యవస్థాపకులు పాల్‌హరీష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రోటరీహాల్లో పేదలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

పందుల దాడిలో లేగదూడకు గాయాలు



పందుల దాడిలో తీవ్రంగా గాయపడిన లేగదూడ

పరవాడ: మంత్రిపాలెంలో ఊర పందుల బీభత్సంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కాలనీల్లో విచ్చల విడిగా సంచరిస్తూ దాడులు చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. గతంలో ఊర పందుల దాడిలో లేగ దూడలు ప్రాణాలు కోల్పోగా మళ్లీ గురువారం కళ్లంలో కట్టిన ఓ లేగదూడపై పందులు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయని వాపోయారు. పందుల కారణంగా పిల్లలు, వృద్ధులు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విచ్చల విడిగా మూగ జీవాలపై దాడులకు పాల్పడుతున్న పందులను నివారించడానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 6,474 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,430	4,010
మొదటి రకం	3,360	3,600
రెండో రకం	3,030	3,460
మూడోరకం	2,880	3,020

అనకాపల్లి సినిమాలు

సార్	రాజా
కోనసీమ	సత్యనారాయణ స్క్రీన్-1
కింగ్	సత్యనారాయణ స్క్రీన్-2
వినరో భాగ్యము విష్ణుకథ	షిర్డిసాయి
డెడ్‌లైన్	పర్తిసాయి
వీరసింహారెడ్డి	వెంకటేశ్వర
శ్రీదేవి శోభన్‌బాబు	శ్రీసత్య
వాల్తేరు వీరయ్య	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 65 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–10 యూనిట్లు , బీ పాజిటివ్–29 యూనిట్లు, బీ నెగిటివ్–1 యూనిట్, ఓ పాజిటివ్–22 యూనిట్లు, ఓ నెగిటివ్–1 యూనిట్, ఏబీ పాజిటివ్–2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 454 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 382 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

కడ‘గండ్ల’ గ్రోయిన్!

- అసంపూర్తి పనులతో వృథాగా పోతున్న సాగునీరు
- వర్షాధారంగానే మూడు గ్రామాల్లో పంటల సాగు
- మంత్రి అమర్‌నాథ్ హామీతో చివురించిన ఆశలు

మూడు గ్రామాల్లో వ్యవసాయ సాగుకు ఏకైక ఆధారం ఉగ్గినపాలెం గ్రోయిన్. ఒకటిన్నర దశాబ్దాలుగా పాలకుల నిర్లక్ష్యం ఆ గ్రామాలకు శాపంగా మారింది. గత ప్రభుత్వంలో దాదాపు రూ.కోటి వెచ్చించినట్టు చెప్పినా.. అరకొర పనులే జరిగాయి. ఆ గ్రామాల వ్యవసాయదారుల ఆశలన్నీ జగన్ ప్రభుత్వంపైనే. తాజాగా మంత్రి అమర్‌నాథ్ దీనిపై దృష్టి సారించడంతో రైతుల్లో ఆశలు రేకెత్తాయి. మంత్రి ఆదేశాల మేరకు నీటిపారుదల శాఖ అధికారులు అంచనాల తయారీలో తలమునకలయ్యారు. ప్రతిపాదనలు సిద్ధమై.. నిధులు విడుదలైతే 15 ఏళ్ల రైతుల కల నెరవేరడం ఖాయం.



దిగువకు వృథాగా పోతున్న నీరు



ఉగ్గినపాలెం గ్రోయిన్‌కు పడిన గండి

కశింకోట : మండలంలోని తేగాడ గ్రామం వద్ద శారదానదిపై ఉన్న ఉగ్గినపాలెం గ్రోయిన్ మరమ్మతులకు నోచుకోక ఏళ్ల తరబడి అసంపూర్తిగానే ఉంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నీరు–చెట్టు కార్యక్రమంలో పనులు చేపట్టారు. కొంత మేర పనులు జరిగిన తర్వాత మధ్యలోనే వదిలేశారు. దీంతో ఆయకట్టుకు సాగు నీరు అందక ఏటా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు.

సగంలో వదిలేశారు

శారదానదిపై ఉన్న ఉగ్గినపాలెం గ్రోయిన్ బ్రిటీష్ వారి హయాంలో నిర్మించారు. తరచుగా నది ప్రవాహ ఉధృతికి గండ్లు పడి ఆయకట్టుకు సాగు నీరు అందని పరిస్థితి. దీంతో రైతులు అరకొర నీటి సరఫరాతో నష్ట పోతున్నారు. 2003లో ఈ గ్రోయిన్‌కు శాశ్వత ప్రాతిపదికపై మరమ్మతులు చేపట్టారు. అదే ఏడాది నది నీటి ప్రవాహ ఉధృతికి మరమ్మతులు చేపట్టిన ప్రాంతం మినహా మిగిలిన చోట్ల రెండు గండ్లు పడ్డాయి. వీటి ద్వారా నీరు దిగువకు వృథాగా పోతోంది. దీంతో చుక్క నీరు కూడా ఆయకట్టుకు చేరని దుస్థితి. తరచుగా గండ్లుపడి దెబ్బతింటున్న గ్రోయిన్‌కు 15 ఏళ్ల పాటు మరమ్మతులు చేపట్టకుండా వదిలేశారు.

ఈ నేపథ్యంలో 2018 జనవరిలో నీరు–చెట్టు కింద సుమారు రూ.91 లక్షలతో మరమ్మతు పనులు చేపట్టారు. దీనిలో భాగంగా ఒక గండిని పూడ్చి మరో గండి పూడ్చకుండా అసంపూర్తిగా వదిలేశారు. ఇక అప్పటి నుంచి మరమ్మతుల్లేవు. ఆయకట్టుకు సాగునీరు సరిగా అందట్లేదు. తరచూ దెబ్బతింటున్న ఆనకట్టకు మరమ్మతులు చేపట్టడానికి బదులు ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేసి ఆయకట్టుకు సాగునీరు అందించాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

వరుణుడు కరుణిస్తేనే పంటలు

ఉగ్గినపాలెం గ్రోయిన్ కింద కొత్తపల్లి, బుచ్చియ్యపేట, ఏఎస్ పేట గ్రామాలకు చెందిన సుమారు 750 ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. వీటిలో ఏటా చెరకు, వరి పంటలు సాగు చేస్తారు. గ్రోయిన్ నుంచి సాగునీరు లభించక పంటసాగుకు వరుణ దేవుడిపైనే ఆధారపడుతున్నారు. సొంత బోర్లున్న కొందరు తప్ప మిగిలిన వారికి వర్షాలు కురిస్తేనే పంటలు చేతికొస్తాయి. లేకుంటే పంట దిగుబడి తగ్గి నష్టపోయే పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆదేశాల మేరకు గ్రోయిన్ మరమ్మతులకు నిధుల మంజూరు కోసం నీటిపారుదల శాఖ అధికారులు రంగంలోకి దిగారు. ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదించడానికి సన్నాహాలు చేస్తున్నారు. నిధులు మంజూరై, మరమ్మతులు పూర్తయితే ఆయకట్టుకు సాగునీరు అంది, తమ బతుకుల్లో వెలుగులు వస్తాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నిధులు రాగానే పనులు

ఉగ్గినపాలెం గ్రోయిన్ మరమ్మతులకు అవసరమైన నిధుల మంజూరు కోసం రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆదేశాల మేరకు తాజాగా ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం. వీటిని ప్రభుత్వానికి నివేదిస్తాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపట్టి పూర్తి చేస్తాం.

–కె. హనుమంతరావు, ఏఈ, నీటిపారుదల శాఖ, అనకాపల్లి

సమస్యల గుర్తింపు.. సత్వర పరిష్కారం

- సాక్షితో జోనల్ కమిషనర్ వెంకటమరణ చిట్‌చాట్



అనకాపల్లిటౌన్ : జోన్ పరిధిలో సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయి సిబ్బందితో పర్యవేక్షించి, ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటామని జోనల్ కమిషనర్ పి.వెంకటరమణ తెలిపారు. గురువారం తన కార్యాలయంలో 'సాక్షి'తో ఆయన మాట్లాడుతూ అనకాపల్లి జోన్ పరిధిలో తక్షణమే చేపట్టాల్సిన కార్యాచరణపై వివరించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

మెరుగైన డ్రైనేజీ వ్యవస్థకు కృషి

పట్టణంలో ప్రధాన కాలువలు నాలుగున్నాయి. వీటిల్లో పూడిక తొలగించాల్సి ఉంది. మరోవైపు వీధి కాలువలు కూడా చాలా చోట్ల మురుగునీటితో పూడుకుపోయాయి. సిబ్బందిని అప్రమత్తం చేసి పూడిక తీత, కాలువల పునరుద్ధరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాల్సి ఉంది. ప్రస్తుతం వేసవి సమీపిస్తుండటంతో ఇలాంటి పనులకు ఇదే మంచి తరుణం.

తడి–పొడి చెత్త సేకరణ

పారిశుధ్య నిర్వహణలో భాగంగా జీవీఎంసీలో పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు తడి–పొడి చెత్త నిర్వహణపై దృష్టి సారించాం. ప్రజలు కూడా పారిశుధ్య సిబ్బందికి సహకరించాలి. తడి–పొడి చెత్తలను వేర్వేరుగా పారిశుధ్య కార్మికులకు అందించాలి. దీని వల్ల తడి చెత్త, పొడి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు ఇలా వేటికవి విభజించడం సులభమవుతుంది.

దోమల నియంత్రణ చర్యలు

కాలువల్లో మురుగునీరు నిలిచిపోవడం వల్లే దోమలు ఎక్కువగా వ్యాప్తి చెందుతున్నాయి. వీటి వల్ల రోగాలు వ్యాప్తి చెందుతున్నట్టు స్థానికుల నుంచి ఫిర్యాదులున్నాయి. దోమల నివారణకు ఫ్రైడే డ్రైడే కార్యక్రమం కొనసాగుతోంది. దీంతోపాటు యాంటీ లార్వా ఆపరేషన్ కూడా ముమ్మరంగా చేపడుతున్నాం. ఇందులో భాగంగా నీటి నిల్వలున్న చోట దోమల మందు పిచికారీ, ఫాగింగ్ తదితర చర్యలు తీసుకుంటున్నాం. దాదాపు ప్రతి రోజూ రాత్రి స్ప్రేయింగ్ పనులు జరుగుతున్నాయి.

తాగునీటికి ఢోకా లేదు

వేసవి నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని జీవీఎంసీ నీటి సరఫరా విభాగం సహకారంతో ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రస్తుతం పట్టణానికి నీరందించే జలాశయాల్లో నీటి మట్టాలు ఆశాజనకంగా ఉన్నాయి. ఈ ఏడాది నీటి ఇక్కట్లు దాదాపు ఉండకపోవచ్చు. పాడైన పైప్‌లైన్లు, బోర్లు మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. మార్చిలోగా ఈ పనులను పూర్తి చేస్తాం. వేసవిలో అడపాదడపా వర్షాలు కురిస్తే తాగునీటి కోసం భయపడాల్సిన పనేలేదు.

సత్వర 'స్పందన'

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి స్పందన కార్యక్రమాన్ని ప్రతి సోమవారం నిర్వహిస్తున్నాం. స్పందనలో వచ్చే అర్జీలపై సత్వర చర్యలు తీసుకుంటున్నాం. జోన్ పరిధిలో ఉన్న మేరకు వేగంగా వాటిని పరిష్కరిస్తున్నాం. పరిధి దాటిన అంశాలను మాత్రమే ప్రధాన కార్యాలయం దృష్టికి తీసుకెళ్తున్నాం. ఇప్పటి వరకు స్పందనలో ఎక్కువగా టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, పబ్లిక్ హెల్త్ విభాగాలకు సంబంధించిన అర్జీలే ఎక్కువగా వస్తున్నాయి. వాటిని జోనల్ పరిధిలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం.

జగనన్న గోరుముద్ద పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మునగపాక హైస్కూల్లో జగనన్న గోరుముద్ద పథకాన్ని పరిశీలిస్తున్న అప్పలనాయుడు

మునగపాక: జగనన్న గోరుముద్ద పథకాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మునగపాక సచివాలయ కన్వీనర్ బొడ్డేడ అప్పలనాయుడు కోరారు. గురువారం ఆయన మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్లో అమలవుతున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా గోరుముద్ద పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. కొత్త మెనూ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన పోషక విలువలతో కూడిన ఆహారం అందుతుందన్నారు. విద్యార్థులు కూడా కష్టపడి చదువుకుని పాఠశాలకు, తల్లితండ్రులకు పేరు తీసుకు రావాలన్నారు. హైస్కూల్ హెచ్‌ఎం కాండ్రేగుల సూర్యనారాయణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లిటౌన్ : జంగిల్ క్లియరెన్స్‌లో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఈఈ రమణమూర్తి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉడ్‌పేట, చదువులవారివీధి, మళ్లవీధి, కాశీవిశ్వేశ్వర ఆలయ ప్రాంతం, వేల్పులవీధి, నర్సింగరావుపేట, జీవీ కోటేశ్వరరావువీధి, గూడ్స్‌రోడ్డు, జార్జి క్లబ్, శాఖవీధి, నాగవంశంవీధి, భీమునిగుమ్మం, రైల్వేస్టేషన్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాల్సిందిగా కోరారు.

చెరువుల సుందరీకరణ



సుందరీకరణ పనులు పూర్తి చేసుకున్న శ్రీరాంపురం చెరువు

పాయకరావుపేట : గ్రామాల్లో చెరువులను సుందరీకరించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లోని చెరువులను గ్రామస్తుల భాగస్వామ్యంతో అందంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా మండలంలో గల శ్రీరాంపురం, సీతారాంపురం గ్రామాల్లో వున్న చెరువులను పరిశీలించి సుందరీకరణ పనులు చేపట్టారు. చెరువు చుట్టూ వున్న గట్టును బలపరిచి దానిని రహదారిలా తీర్చిదిద్దుతున్నారు. దీంతో ఇక్కడ వాకింగ్ చేసేందుకు వీలు కలుగుతుంది. అలాగే చెరువు చుట్టూ ఇనుప కంచె కూడా ఏర్పాటు చేయనున్నారు. చెట్ల పెంపకం కూడా చేపట్టనున్నారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి చెందిన (ఎన్‌ఆర్ ఈజీఎస్) వేతనదారులతో పనులు చేయించటం ద్వారా వారికి ఉపాధి కల్పిస్తున్నారు.

మద్యం తరలిస్తూ పట్టుబడ్డ వ్యక్తి

కశింకోట : మండలంలోని వెదురుపర్తి గ్రామం వైపు మద్యం సీసాలను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని గురువారం అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు. వెదురుపర్తికి చెందిన ఆళ్ల రమణ కశింకోట నుంచి మద్యం తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. అతడి నుంచి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు.

ఘనంగా కాశీ విశాలాక్షి సమేత విశ్వేశ్వరుని కల్యాణం



కాశీ విశ్వేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు



అన్న సమారాధన

మునగపాక: మెయిన్‌రోడ్డులోని లింగరాయిగుడిలో గురువారం కాశీ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. వేద పండితులు సోమశేఖర్ నేతృత్వంలో కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా కాశీ విశ్వేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి భక్తులతో ఆలయం కిటకిటలాడింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ సూరిశెట్టి రాము, కోశాధికారి వేగి సాయిబునాయుడు తగు చర్యలు తీసుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధనకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పెంటకోట జగన్నాథం, పెంటకోట సూర్యనారాయణ, కిరణ్, భీశెట్టి వెంకట్, ఆడారి అచ్చియ్యనాయుడు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

సురేష్‌రాజ్‌కు అభినందన



పాలిశెట్టి సురేష్‌రాజ్‌ను అభినందిస్తున్న కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం: వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా నియమితులైన మండలంలోని లగిశెట్టిపాలేనికి చెందిన పాలిశెట్టి సురేష్‌రాజ్‌ను పార్టీ జిల్లా అధ్యక్షుడు కరణం ధర్మశ్రీతో పాటు పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ గురువారం సత్కరించి అభినందనలు తెలిపారు. తనకు ఈ అవకాశం కల్పించిన పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, పరిశ్రమల శాఖామంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌కు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

అధికారుల తీరుపై గరం గరం

మండల సర్వసభ్య సమావేశంలో గళం విప్పిన ప్రజాప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి

సబ్బవరం: అధికారులు తమ పరిధిలోని సమస్యలు పరిష్కరించడంలో అలసత్వం వహించడం సరికాదని ఎంపీపీ బోకం సూర్యకుమారి అసహనం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఆయా శాఖల పనితీరు, ప్రగతిని సమీక్షించారు. గ్రామాల్లో మండల స్థాయి అధికారులు పర్యటించినపుడు తమకు సమాచారం ఉండడం లేదని, పదేపదే సభలో సమస్యను లేవనెత్తినప్పటికీ పరిష్కారానికి నోచుకోవడం లేదని పలువురు సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఎంపీపీతో పాటు జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు మాట్లాడుతూ కొంత మంది మండల స్థాయి అధికారులు కావాలనే సభకు గైర్హాజరవుతున్నారన్నారు. దీంతో ఆయా శాఖలకు సంబంధించిన సమస్యలను ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. అధికారులు గ్రామాల్లో పర్యటించినపుడు స్థానిక ప్రజా ప్రతినిధులకు సమాచారం అందించడం వల్ల కొన్ని సమస్యలు అక్కడికక్కడే పరిష్కారమవుతాయన్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సభ్యులంతా అసహనం వ్యక్తం చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కార్యకలాపాలు సక్రమంగా జరగడం లేదని,జిల్లా రిజిస్ట్రార్‌కు లెటర్ రాయాలని ఎంపీడీవోకు ఎంపీపీ ఆదేశించారు.పైడివాడ అగ్రహారంలో లేఅవుట్‌లో రైతులకు ఇచ్చిన ప్లాట్‌లను అభివృద్ధి చేయాలని ఎంపీటీసీ రాజు సభ దృష్టికి తీసుకువచ్చారు.

అభివృద్ధి పనులు వేగవంతం



సమావేశానికి హాజరైన అధికారులు, సభ్యులు



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీపీ వెంకట పద్మలక్ష్మి

ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి

పరవాడ: మండలంలోని వివిధ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయడానికి అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన, ఆర్ అండ్ బీ రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయని చెప్పారు. మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో 966 జగనన్న గృహాలు మంజూరు కాగా వాటిలో 378 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని గృహ నిర్మాణ శాఖ ఏఈ ఎం.ఎస్.ఎస్.ఎన్ రెడ్డి చెప్పారు. జల్ జీవన్ మిషన్ ద్వారా మండలంలోని 20 గ్రామాల్లో ఇంటింటి కుళాయిల నిర్మాణ పనులు పూర్తి కాగా 17 గ్రామాల్లో ప్రగతిలో ఉన్నాయని, మరో ఏడు గ్రామాల్లో పనులు ప్రారంభమయ్యాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ షణ్ముఖ వివరించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటి బోర్లు మరమ్మతులకు గురైతే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు.

- మండలంలో మూడో విడత రైతు భరోసా అందని 129 మంది లబ్ధిదారులకు ఈ నెల 27న ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమచేస్తుందని మండల వ్యవసాయ శాఖ అధికారి సీహెచ్.చంద్రావతి చెప్పారు. మండల సమావేశాలకు గైర్హాజరవుతున్న రెవెన్యూ అధికారులను వివరణ కోరాలని ఎంపీడీవోను ఎంపీపీ ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవో వి.హేమసుందర్రావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైస్ ఎంపీపీలు బి.నాగేశ్వరరావు, బి.అప్పలరాజు, పైల శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

'ఎండీఎం కార్మికుల సమస్యలు తీర్చాలి'

అనకాపల్లి రూరల్ : మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ఉద్యోగ భద్రత లేదని, ప్రమాదాలు జరిగితే వారికి ఎలాంటి సాయం ప్రభుత్వాలు చేయట్లేదని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జి.వరలక్ష్మి ఆవేదన వెలిబుచ్చారు. గురువారం ఆమె స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి మండలం జుడిపల్లి గ్రామంలో వంట చేస్తూ ప్రమాదానికి గురైన కార్మికురాలు చికిత్స పొందుతూ విశాఖ కేజీహెచ్‌లో మృతి చెందినట్టు తెలిపారు. ఎండీఎం కార్మికుల వేతనాలు పెంచాలని, చనిపోయిన కార్మికురాలికి నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. కార్మికులకు ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్ చేశారు.

వేసవిలో హాయిగా..

చురుగ్గా విద్యుత్ లైన్ల నిర్వహణ పనులు



పి.బోనంగి విద్యుత్ లైన్‌లో మరమ్మతులు చేస్తున్న ఈపీడీసీఎల్ సిబ్బంది

పరవాడ: వేసవిలో కూడా నాణ్యమైన విద్యుత్ అందించడానికి అధికారులు సన్నద్ధమయ్యారు. విద్యుత్ వినియోగం పెరగనున్న దృష్ట్యా అవసరమైన మరమ్మతులు చేపట్టడంతో పాటు నిర్వహణ సామర్థ్యంపై దృష్టిసారించారు. దీని కోసం విడతల వారీగా పనులు చేపడుతున్నారు. ఆయా ఫీడర్ల పరిధిలో జంగిల్ క్లియరెన్స్‌తో పాటు అవసరమైన చోట నూతన పరికరాలు అమర్చుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద, లైన్లలో ఉన్న చిన్నచిన్న మరమ్మతులు పూర్తి చేస్తున్నారు. దీనిలో భాగంగా మండలంలో ని పి.బోనంగి గ్రామంలో గురువారం నిర్వహణ పనులు చేపట్టారు. ఎన్టీపీసీ ఫ్లైయాష్ కారణంగా వైర్లు తుప్పు పట్టి తరచూ విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం కలుగుతోంది. దీంతో సర్పంచ్ బండారు కల్పన రాజశేఖర్ , జెడ్పీటీసీ పి.ఎస్.రాజు సమస్యను ఈపీడీసీఎల్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో తుప్పు పట్టిన విద్యుత్ వైర్లు మార్చి కొత్తవి ఏర్పాటు చేశారు. విద్యుత్‌స్తంభాలపై దెబ్బ తిన్న కేశారాలను తొలగించి నూతన కేశారాలు, పిన్నులు ఏర్పాటు చేశారు. విద్యుత్ పరమైన సమస్యల పరిష్కారానికి కృషి చేసిన జెడ్పీటీసీ పి.ఎస్.రాజుకు సర్పంచ్ కల్పన రాజశేఖర్, మాజీ ఎంపీటీసీ దెక్క శ్రీనివాసరావు ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌ను గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

అచ్యుతాపురం(అనకాపల్లి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సుధాకర్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే కన్నబాబురాజు కోరారు. గురువారం అచ్యుత పబ్లిక్ స్కూల్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్‌బూత్‌ల వారీగా సమీక్ష నిర్వహించారు. అధిష్టానం ఎంపిక చేసిన సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు రొంగలి జగన్నాథం, యలమంచిలి మున్సిపల్ చైర్మన్ పిల్లా రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, మండల నాయకులు పాల్గొన్నారు.